వీడినమబ్బులు



లంచ్ టైమ్‌లో చేతి పనిని కట్టిపెట్టి నేను రానంటున్నా వినకుండా ఫ్రెండ్ శ్రీధర్‌ని కూడా క్యాంటీన్‌కి తీసుకొచ్చాడు వేణు. ఆకలి లేదంటున్న శ్రీధర్‌కి కాఫీ, తనకి టిఫిన్ ఆర్డర్ చేశాడు.

టిఫిన్ తింటూ కాఫీ సిప్ చేస్తున్న శ్రీధర్‌ని అడిగాడు వేణు.

''ఒరేయ్ నేను నిన్ను చాలా రోజుల్నించి గమనిస్తున్నాను. నువ్వు మునుపటిలా సరదాగా ఉండడంలేదురా. దేని గురించో వర్రీ అవుతున్నట్లుగా ఉంది నీ వాలకం చూస్తుంటే. అదేదో నాతో షేర్ చేసుకోకూడదురా. నేనేమైనా సహాయం చెయ్యగలనేమో...''

''ఏం లేదురా. నన్ను చాలా రోజులనించీ ఒక సందేహం పీడిస్తున్నది. అదేంటంటే మా బాబు పుట్టిన ఈ ఆరునెలల్లో నేను ఒక్కసారి కూడా మా ఆవిడ వాడ్ని ముద్దుపెట్టుకోవడం గానీ, గారం చేయడం గానీ చూడలేదురా. నాకు ఆమెలో అన్నతల్లి తన పిల్లలమీద చూపే సహజమైన ప్రేమానురాగాలు కనబడడంలేదు. ఇది నాకు చాలా వింతగా అనిపిస్తోంది. మా వాడి పనులన్నీ ఏదో బాధ్యతగా చేసినట్లుంటుంది. కానీ అందులో ఇన్‌వాల్వ్‌మెంట్ కనబడదు. నేనెక్కడో చదివాను స్త్రీ తనకి ఇష్టం లేని వ్యక్తి వల్ల కలిగిన సంతానాన్ని ప్రేమించదు అని. కొంపతీసి అది కానీ నిజం కాదు కదా...!''అన్నాడు శ్రీధర్.

''ఛ..ఛ..అదేం అయి ఉండదురా. మీ ఆవిడకు నీ మీద ప్రేమ లేకపోవడం ఏంటిరా. మీరిద్దరూ ఆదర్శ దంపతులని రోజుకొకసారైనా మేం అనుకుంటూ ఉంటాం. నువ్వు అనవసరంగా లేనిపోని అపోహలు పెట్టుకోకు. ఓ పని చేస్తేనో! ఈ విషయం డైరెక్టుగా మీ ఆవిడ్నే అడిగేస్తే పోలా? ఈ ముసుగులో గుద్దులాట దేనికి?''

ఆ మాటకి శ్రీధర్ అన్నాడు ''అదే చేద్దామనుకుంటున్నానురా! ఈ విషయం ఏదో త్వరగా తేల్చుకోవాలి. నా బాధంతా ఇలా తల్లి ప్రేమకు కరువైతే మా బాబు మెంటల్ డెవలప్‌మెంట్ ఏమవుతుందనే. సృష్టిలో అతి పవిత్రమైన తల్లి ప్రేమకి మా బాబు దూరం కాకూడదనే నా ఆవేదనంతా''

''నిజమేరా. అందుకే ఈ విషయం గురించి మీ ఆవిడతో ఈవేళే డిస్కస్ చేయి. ఆలుమగల మధ్య ఎటువంటి అరమరికలూ ఉండకూడదని నమ్మేవాళ్లలో నేను కూడా ఒకడ్ని'' సలహా ఇచ్చాడు వేణు.

★ ★ ★

సాయంత్రం ఇంటికి వచ్చిన శ్రీధర్ డ్రాయింగ్ రూంలో కనబడిన దృశ్యం చూసి ఒక్కసారిగా స్టన్ అయ్యాడు. తను చూస్తున్నది కలా నిజమా! ఒక్కసారి గిల్లుకుని చూసుకున్నాడు. సందేహం లేదు. ఇది కల కాదు నిజమే!

ఇంతకీ శ్రీధర్‌ని అంతగా ఆశ్చర్యపరిచిన విషయం ఏంటంటే తన శ్రీమతి కవిత తమ బాబుని ఒళ్లోకి తీసుకుని ముద్దులతో ముంచెత్తుతున్నది. కవిత తమ బాబుమీద కురిపిస్తున్న మాతృత్వపు చిరుజల్లుని ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు. ఎందుకో గుమ్మం వైపునకు తిరిగి చూసిన కవిత భర్త అలా స్తంభించిపోయి నిలుచుండిపోవడం చూసి క్షణం ఆశ్చర్యపోయి అంది ''అదేంటండీ గుమ్మంలోనే నిలబడిపోయారు...అదేదో వండర్ చూసినవాళ్లలా ఆ మొహం ఏంటి?''

ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ చెప్పాడు శ్రీధర్ తనను ఇన్నాళ్లనుంచీ కలవర పెడుతున్న విషయం. తనకు కలిగిన సందేహాలు వగైరా వగైరా...

''ఓ...అదా'' తేలిగా కొట్టిపారేసింది కవిత.

''భలేవారే అది నాకు బాబు మీద ప్రేమ లేక కాదండీ. ఎందుకో చిన్నప్పటి నుంచీ నాకు బాహాటంగా ప్రేమని, అదెవరైనా గానీ ప్రదర్శించడం ఇష్టం ఉండదు. అలా చేయడం వల్ల ఇతరులకి మనని చూసి ఈర్ష్య పడే అవకాశం మనమే ఇచ్చినవాళ్లమవుతామని నా అభిప్రాయం. నేను నలుగురి ముందూ బాబుని ముద్దుచేయకపోవడానికి కారణం ఇదే!''

''నువ్వు చెప్పింది నిజమనుకున్నా నాకు ఇంకో సందేహం కవితా. బయటివాళ్ళముందు సరే. మరి నా ముందు కూడా నువ్వు ఎప్పుడూ బాబుని ముద్దుపెట్టడం నేను చూడలేదు. మరి దానికి కారణం?''

''ఎంత అమాయకులండీ మీరు. నేను చెప్పిన సూత్రం మీకు కూడా వర్తిస్తుందండీ శ్రీవారూ! బాబు మీద ప్రేమతో మిమ్మల్ని నిర్లక్ష్యం చేస్తున్నాననే భావం తద్వారా బాబు మీద మీకు ఈర్ష్య కలగకుండా ఉండాలనే ఈ తాపత్రయం అంతా. ఇప్పటికైనా అర్థం అయిందాండీ బుద్ధావతారం గారూ'' వెక్కిరించింది కవిత. బాబుని శ్రీధర్‌కిచ్చి కాఫీ తేవడానికి కిచెన్‌లోకి వెళ్తూ...

ఆ మాటలకి శ్రీధర్ మనస్సు మబ్బులు వీడిన ఆకాశంలా ఎంతో తేలికైంది.

-మాధవపెద్ది ఉష (హైదరాబాద్)